# నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక

సంచిక : 2 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 2-4 -2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.




## నేడు వక్ఫ్ బిల్లుపై సమగ్ర చర్చ

- బీఏసీ సమావేశం నుంచి కాంగ్రెస్ వాకౌట్
- ఎంపిలకు విప్ జారీ చేసిన బీజేపీ

న్యూఢిల్లీ ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)
నేడు వక్ఫ్ బిల్లుపై సమగ్ర చర్చ జరుగనున్న నేపథ్యంలో నిర్వహించిన బీఏసీ సమావేశం నుంచి కాంగ్రెస్ వాకౌట్ చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా బావిస్తున్న వక్ఫ్ సవరణ బిల్లు బుధవారం నాడు పార్లమెంటు- ముందుకు రాబోతున్న తరుణంలో.. బిజెపి తన ఎంపిలకు విప్ జారీచేసింది. ఈ బిల్లుకు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే

-మిగతా 2 లో




## హామీల అమలులో రేవంత్ విఫలం

ఇచ్చిన హామీలపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం
బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)
రైతు భరోసా అమలు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తన మాటను నిలబెట్టుకోలేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, మాట తప్పడం, రైతులను మోసం చేయడం రేవంత్ రెడ్డికి అలవాటు-గా మారిందని

-మిగతా 2 లో



## 2026 నాటికి నక్సలిజం నిర్మూలనే లక్ష్యం

- నక్సల్స్ ప్రభావిత జిల్లాల సంఖ్య ఆరుకు చేరిక
- హోంమంత్రి అమిత్ షా వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)
2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని మోదీ ప్రభుత్వం పూర్తిగా నిర్మూలిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 నుంచి ఆరుకు తగ్గినట్లు వెల్లడించారు.

-మిగతా 2 లో



హెచ్‌సీయూ భూ వివాదంపై

## ప్రభుత్వం దృష్టి

### మంత్రులతో సీఎం రేవంత్ సమీక్ష

- విపక్షాల విమర్శలకు స్పష్టమైన సమాధానం
- బిల్లీరావు చేతిలో ఉన్న భూములను కొట్లాడి సాధించాం
- మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)
హెచ్‌సియూ భూ వివాదంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఈ విషయంలో నిజానిజాలను ప్రజల ముందుంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సిఎం రేవంత్ అధ్యక్షతన పలువురు మంత్రులు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో భేటీ అయ్యారు. ఈ భేటీలో పూర్వాపరాలను చర్చించారు.

-మిగతా 2 లో

## విధ్వంసం మీ ఏకైక నినాదం!

### రేవంత్‌ది బుల్డోజర్ల పాలన అనటానికి ఇదే నిదర్శనం



- పేదల ఇండ్ల కూల్చివేతకు వెళ్లిన బుల్డోజర్లు మళ్లీ హెచ్‌సీయూ భూముల స్వాధీనానికి..
- ఎందుకు కాంగ్రెస్‌కు పాలన అప్పగించామని అన్నివర్గాల మనోవేదన
- కాంగ్రెస్ పాలన తీరుపై కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)
అప్పుడు మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇండ్లు కూల్చిన రేవంత్, ఇప్పుడు హెచ్‌సీయూ భూములపై పడ్డాడని ఆయన పాలనలో కేవలం బుల్డోజర్లు తప్ప ఏమి కనిపించడం లేదని మాజీమంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్ర పరిస్థితి చూస్తుంటే అసలు కాంగ్రెస్‌కు ఎందుకు పాలన

-మిగతా 2 లో




## లెక్కలు తీస్తే బొక్కలు విరుగుతాయ్

- హెచ్‌సీయూ భూములపై రామేశ్వరరావు కన్ను
- హెచ్‌సీయూ భూములపై ఆనాడు కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదు
- ఘాటుగా స్పందించిన టీపీసీసీ మహేష్ కుమార్‌గౌడ్

హైదరాబాద్ ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)
హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. అన్ని యూనివర్సిటీల భూములపై సర్వే వేయించి కాపాడాలని ముఖ్యమంత్రికి రిక్వెస్ట్ చేస్తానన్నారు. లెక్కలు తీస్తే బొక్కలు విరుగుతాయన్నారు. హెచ్‌సీయూ కోసం ఇందిరా గాంధీ 2500 ఎకరాలు ఇచ్చారని

-మిగతా 2 లో



## విదేశీ యువతిపై అత్యాచారం

### దర్యాప్తు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్,ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)
రాష్ట్రంలో అత్యాచారాలు బాగాపెరిగిపోతున్నాయి. ఏదోవిధంగా యువతులను నమ్మిస్తున్న యువకులు దారుణాలకు ఒడిగడుతున్నారు. మొన్న ఓ ఆలయానికి వెళ్లిన యువతిని సామూహిక అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. దానిని మరువకముందే హైదరాబాద్ శివారులో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ఆ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లో ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న యువతికి లిఫ్ట్ ఇస్తానని చెప్పి ముగ్గురు యువకులు కార్‌లో ఎక్కించుకున్నారు. అనంతరం మీర్‌పేట్ దగ్గరలోని మందమల్లమ్మ దగ్గర..

-మిగతా 2 లో

## ఢిల్లీ చేరుకున్న చిలీ అధ్యక్షుడు

### ప్రధాని మోడీతో భేటీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)
చిలీ అధ్యక్షుడు గాబ్రియేట్ బోరిక్ ఫాంట్ భారత్ పర్యటనలో భాగంగా ఢిల్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భారత ప్రధాని మోడీని ఆయన కలిశారు. ఇరు దేశాల నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వెల్లడించారు.కాగా,

-మిగతా 2 లో

## హెచ్‌సీయూ భూముల్లో కాంగ్రెస్ విధ్వంసం



- ఆభూములపై సుప్రీంకోర్టులో కేసులున్నాయి
- చదును పేరుతో కోర్టు ధిక్కారణ
- భూముల వేలం ప్రక్రియతో కాంగ్రెస్ అరాచకానికి పరాకాష్ట
- కేంద్రమంత్రి బండిసంజయ్ ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)
కాంగ్రెస్ ప్రభుత్వం చెట్లను తొలగిస్తూ, మొక్కలను పీకేస్తూ పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతోందని కేంద్ర మంత్రి బండిసంజయ్ ఆరోపించారు. రాష్ట ప్రభుత్వం వేలం వేయాలనుకున్న 400 ఎకరాల భూమి అటవీ పరిధిలోనిదని, అటవీ లక్షణాలు కలిగిన ఏ భూమినైనా కేంద్ర ప్రభుత్వ

-మిగతా 2 లో

# విధ్వంసం మీ ఏకైక నినాదం!

(మొదటి తరువాయి)

అప్పగించామంటూ అన్నివర్గాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. తొలుత పర్యావరణ పరిరక్షణ పేరుతో చాలా మంది పేదల ఇండ్లను కూల్చివేశారని మండిపడ్డారు. ఆ తర్వాత అభివృద్ధి పేరుతో గిరిజన గ్రామాలను వెంబడించారని.. బంజరు భూములు, బల్లులు కూడా గుడ్లు పెట్టవు అన్నారని.. ఇప్పుడు మీరు జంతువుల గూళ్ళను వెంటాడి సామూహిక హత్యలు చేస్తారంటూ మండిపడ్డారు. విధ్వంసం మీ ఏకైక నినాదం! మీ ఖజానాను దాఖలు చేయడమే ఏకైక నినాదం.. నేను మిమ్మల్ని అడుగుతున్నాను రేవంత్ రెడ్డి.. మీ బుల్డోజర్లు వారాంతంలో, రాత్రిపూట ఎందుకు నిరంతరాయంగా పనిచేశాయి.. మీరు కోర్టుకు ఎందుకు భయపడుతున్నారు? మీరు ఏమి దాచారు? అంటూ తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో హెచ్‌సీయూ భూముల్లో బుల్డోజర్లు చదును చేస్తుండడంతో అక్కడి అటవీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో జింకలు అక్కడ ఏం జరుగుతుందో తెలియక ఆగమాగం అవుతున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదికగా కేటీఆర్ ట్వీట్ చేశారు. పెద్ద సంఖ్యలో అర్ధరాత్రి మోహరించిన బుల్డోజర్లతో నెమళ్లు అరుపులతో అటవీ ప్రాంతం దద్దరిల్లింది. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. కంచె గౌచ్చిబౌలిలోని హెచ్‌సీయూ సమీపంలో ఉన్న 400 ఎకరాల భూమిని ఇటీవల కాంగ్రెస్ అమ్మేయాలని కాంగ్రెస్ సర్కారు నిర్ణయించింది. ఆ స్థలాన్ని చదును చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున బుల్డోజర్లను మోహరించారు. చదును చేయడాన్ని విద్యార్థులు అడ్డుకున్నారు. ఆ భూమి యూనివర్సిటీదేనని పేర్కొంటున్నారు. ప్రకృతి విధ్వంసాన్ని ఆపాలని.. అక్కడ ఉంటున్న జీవరాశిని కాపాడాలని విద్యార్థులతో పాటు పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

## లెక్కలు తీస్తే బొక్కలు విరుగుతాయ్

(మొదటి తరువాయి)

తెలిపారు. కేటీఆర్, కిషన్ రెడ్డి చేతిలో చెయ్యేసి చెప్పు బావ అనే లాగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రామేశ్వర రావు కన్ను హెచ్‌సీయూ భూములపై పడిందన్నారు. కోర్టులో ఉన్న కారణంగా భూములను కొల్లగొట్టలేకపోయారని తెలిపారు. హెచ్‌సీయూ అన్యాక్రాంత భూముల్లో మై హోం విహంగ భవనం వెలిసిందంటూ వ్యాఖ్యలు చేశారు. హెచ్‌సీయూ భూముల్లో మైహోం భవనాలు కట్టారని... అప్పుడు బీజేపీ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో అక్కడ రోడ్లు వేశారని చెప్పుకొచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ బినామీలకు భూములు ఇచ్చేపుడు వన్య ప్రాణులు కనపడలేదా అని నిలదీశారు. 534 ఎకరాలు ప్రభుత్వం తీసుకున్నందుకు గోపనపల్లిలో 397 ఎకరాల భూమిని యూనివర్సిటీకి కేటాయించారని తెలిపారు. విద్యార్థులను రెచ్చగొట్టి కేటీఆర్ రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కోట్లాది రూపాయల భూములను కొల్లగొట్టింది బీఆర్ఎస్ నాయకులే అంటూ టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. క్యాబినెట్ విస్తరణపై అభిప్రాయాలు చెప్పామన్నారు. అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. తాముఇప్పటి వరకు ఎలాంటి తేదీలు చెప్పలేదని తెలిపారు. సాయంత్రం ఢిల్లీకి వెళ్తున్నామని.. బీసీ సంఘాల నిరసన కార్యక్రమంలో పాల్గొంటామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## విదేశీ యువతిపై అత్యాచారం



(మొదటి తరువాయి)

సదరు యువతిని కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఆ జర్మనీ యువతి పహాడీ షరీఫ్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మీర్‌పేట్ దగ్గర లిఫ్ట్ ఇస్తామని చెప్పి వాళ్లు కార్ ఎక్కించుకున్నట్టు ఆమె కంప్లైంట్లో వివరించింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల్ని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. బాధితురాలు విదేశీ యువతి కావడంతో కేసును మరింత సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాధిత యువతిని వైద్య పరీక్షల కోసం హాస్పటల్‌కు తరలించారు పోలీసులు.

# హెచ్‌సియూ భూ వివాదంపై ప్రభుత్వం దృష్టి

(మొదటి తరువాయి)

అనంతరం మంత్రులు భట్టి, శ్రీధర్ బాబులు సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన ఆస్తి, ఒక అంగుళం భూమిని కూడా రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడంలేదని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ విషయంలో కొంతమంది వ్యక్తులు, కొన్ని పార్టీలతో అనుసంధానంగా ఉన్న సంఘాలు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వర్సిటీ భూమి వర్సిటీకే ఉందని స్పష్టం చేశారు.

ప్రభుత్వ పనికి అడ్డుతగిలితే ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. సచివాలయంలో నిర్వహించిన మంత్రుల మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. కంచె గచ్చిబౌలి భూములపై బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హెచ్ సీయూ ఇంచు భూమి కూడా ప్రభుత్వం తీసుకోలేదన్నారు. హెచ్ సీయూ భూములను గుంజుకుంటున్నారని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలనే తమ ఆలోచన అని అన్నారు. 13 ,01,2004 వరకు ఆ భూములు హెచ్ సీయూవేనని చెప్పారు. ఆ తర్వాత 2004 లో బదలాయింపు కింద హెచ్ సీయూకి పక్కనే 397 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు . ఆనాటి ప్రభుత్వానికి హెచ్ సీయూ 400 ఎకరాలు ఇచ్చిందన్నారు. బిల్లీరావు అనే వ్యక్తి చేతిలో ఇన్ని రోజులు ఆ భూమి ఉందన్నారు భట్టి. ఆ భూమి తమదేనని బిల్లీరావు సుప్రీంలో రిట్ పిటిషన్ వేశారని చెప్పారు. 2014నుంచి2013 వరకు ఆ భూములను బీఆర్ఎస్ ఎందుకు పట్టించుకోలేదని భట్టి ప్రశ్నించారు. వేల కోట్ల భూమిని 400 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తికి ఎలా అప్పగిస్తాం. ప్రభుత్వ భూమి ఇంచు కూడా వెళ్లకూడదని కేబినెట్ నిర్ణయించింది. ఈ భూములపై కాంగ్రెస్ సర్కార్ పోరాడింది. హైకోర్టులో కొట్లాడి కేసు గెలిచాం. దశాబ్ద కాలం పోరాడి ఆ భూములను కాపాడినం. వేల కోట్ల విలువైన భూములను ప్రజలకు దక్కేలా చేశాం. ప్రజల కలలను నిజం చేసేందుకు మేం పోరాటం చేస్తున్నాం. మా ఆలోచన అంతా సంపదను సృష్టించడంపైనే. రాజకీయ స్వార్థం కోసం కొన్ని పార్టీలు కుట్ర చేస్తున్నాయి అని భట్టి అన్నారు. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని న్యాయపరంగానే తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హెచ్ సీయూ విద్యార్థులు ఆందోళన పడొద్దు..పార్టీల ప్రలోభాలకు లోనవద్దని సూచించారు. కంచె గచ్చి బౌలి భూములపై బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. 400 ఎకరాలు20 ఏండ్లుగా న్యాయపోరాటంలో ఉందన్నారు. వర్సిటీ విద్యార్థులు, సిబ్బందికి తాము విజ్ఞప్తి చేస్తున్నామని చెప్పారు. హెచ్ సీయూ భూమిలో ఇంచు భూమిని కూడా ప్రభుత్వం తీసుకోలేదన్నారు. వారం రోజుల క్రితమే హెచ్ సీయూ వీసీ,సబ్ రిజిస్ట్రార్ తో తాము సంప్రదింపులు జరిపామన్నారు. కొంత మంది వ్యక్తులు విద్యార్థులను రెచ్చగొడుతున్నారు. తప్పుడు ప్రచారాలను ప్రజలకు చేరవేస్తున్నారు. 2016లో సీనియర్ ఐఏఎస్ అధికారితో కమిటీని వేశారు. గందరగోళం సృష్టించేందుకు బీఆర్ఎస్,బీజేపీ కుట్ర చేస్తున్నాయి. జీవ వైవిధ్యానికి ఎలాంటి నష్టం కల్గించకుండా చూస్తాం. ప్రభుత్వ భూమిలో ఉన్న రాక్స్,లేక్ లను కాపాడుతాం. 2003లో ఆనాటి ప్రభుత్వం తప్పిదం చేసింది. 400 ఎకరాల ప్రభుత్వాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రైవేట్ వ్యక్తి చేతిలో ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది అని శ్రీధర్ బాబు అన్నారు. వారం రోజుల క్రితం హెచ్‌సీయూ వీసీ, రిజిస్ట్రార్‌తో ప్రభుత్వ పరంగా మేం సంప్రదింపులు చేశాం. వారికి స్పష్టంగా చెప్పాం. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించాలని భావించాం. వర్సిటీ భూమి వర్సిటీకే ఉండాలని వారికి తెలియజేశాం. 1500 పైచిలుకు ఎకరాల భూమి వారికి న్యాయపరంగా ఇచ్చేందుకు సిఫార్సులు చేశారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని మీరు మీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో చర్చించాలని సూచించాం. చట్టపరమైన అన్ని హక్కులు కల్పిస్తామని వారికి స్పష్టంగా చెప్పాం అన్నారు. గత రెండు రోజుల నుంచి కొన్ని మీడియా సంస్థలు, కొన్ని పార్టీలకు సంబంధించిన సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారు.

# హెచ్‌సీయూ భూముల్లో కాంగ్రెస్ విధ్వంసం

(మొదటి తరువాయి)

ఆమోదం లేకుండా నరికివేయలేమని సుప్రీం కోర్టుతీర్పులున్నాయని ఆయన అన్నారు. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమికి సంబంధించి హైకోర్టులో కేసు నడుస్తోందని, వట ఫౌండేషన్ అనే ఎన్‌జీవో దాఖలు చేసిన కేసులో ఏప్రిల్ 7 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. ఆ భూములను వేలం వేయడం కుదరదని.. ఈ విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం భూముల చదును పేరుతో కోర్టు ధిక్కారణకు పాల్పడుతోందని బండి సంజయ్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మించి కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాలకు కాకుండా ప్రభుత్వ భూములను అడ్డగోలుగా విక్రయించడాన్ని రేవంత్ రెడ్డి గతంలో వ్యతిరేకించిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. కంచె గచ్చిబౌలి భూముల విక్రయం కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలకు పరాకాష్ట అని, తక్షణమే గచ్చిబౌలి భూముల అమ్మకంపై ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని బండి సంజయ్ కుమార్ అన్నారు. కాగా కంచె గచ్చిబౌలి భూములపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిల్‌ను న్యాయస్థానం స్వీకరించింది. బుధవారం విచారణ జరగనుంది. ఆ 400 ఎకరాలు హెచ్‌సీయూ భూమి అని, అటవీ భూమిలో వన్య మృగాలకు ఆవాసం ఉండదని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ భూములను డీఫారెస్టైజేషన్ చేసి అమ్మి రూ. వేల కోట్లు దండుకోవాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఈ క్రమంలో వట ఫౌండేషన్ 400 ఎకరాల వివాదాస్పద భూముల వ్యవహారంపై ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేసింది. కంచె గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని పిటిషన్‌లో కోరారు. అత్యవసరంగా పిటిషన్ స్వీకరించి విచారణ చేపట్టాలని వట ఫౌండేషన్ లాయర్ కోరారు. బుధవారం ఈ పిటిషన్‌ను విచారిస్తామని న్యాయస్థానం పేర్కొంది.

# నేడు వక్ఫ్ బిల్లుపై సమగ్ర చర్చ

(మొదటి తరువాయి)

ఉభయ సభల ఆమోదం లభించేలా చూసేందుకు అధికార పార్టీ పట్టుదలగా ఉంది. పలు కారణాలతో విపక్షాలు విభేదిస్తున్న క్రమంలో బిల్లును ఈనెల 2న లోక్‌సభలో ప్రవేశపెడుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. స్పీకర్ దీనిపై చర్చకు 8 గంటలు కేటాయించాలని నిర్ణయించారు. అనంతరం ఓటింగ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో తమ ఎంపీలకు బీజేపీ మూడులైన్ల విప్ జారీ చేసింది. ఎంపీలంతా బుధవారంనాడు తప్పనిసరిగా సభకు హాజరుకావాలని, రోజంతా ఉండాలని, ప్రభుత్వ వైఖరికి బాసటగా నిలడాలని పార్టీ ఎంపీలను బీజేపీ కోరింది. కాగా, వక్ఫ్ బిల్లుపై చర్చా సమయం, పార్టీలకు సంఖ్యాబలం ఆధారంగా సమయం కేటాయింపుపై చర్చించేందుకు బీఏసీ సమావేశానికి బీజేపీ మంగళవారంనాడు పిలుపునిచ్చారు. బిల్లుపై చర్చకు 8 గంటలు కేటాయించాలని బీఏసీలో నిర్ణయించారు. అయితే 12 గంటల సేపు చర్చించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. దీనిపై తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో సమావేశం నుంచి విపక్షాలు వాకౌట్ చేశాయి. వక్ఫ్ సవరణ బిల్లు-2024ను బుధవారంనాడు ప్రశ్నోత్తరాల సమయం అనంతరం లోక్‌సభలో ప్రవేశపెడతారని, దీనిపై 8 గంటలసేపు చర్చ జరపాలని బీఏసీ సమావేశం నిర్ణయించిందని, అవసరాన్ని బట్టి సమయం పొడిగించే వీలుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. సభలో చర్చను తాము కోరుకుంటున్నామని, ప్రతి రాజకీయ పార్టీకి తమ అభిప్రాయాన్ని చెప్పే హక్కు ఉంటుందని, సవరణ బిల్లుపై ఏ పార్టీ ఎలాంటి వైఖరి తీసుకుందో ప్రజలు కూడా తెలుసుకోవాలని అనుకుంటారని చెప్పారు.

## హామీల అమలులో రేవంత్ విఫలం

(మొదటి తరువాయి)

ఆయన ధ్వజమెత్తారు. జనవరి 26న రైతు భరోసా కింద ఇచ్చే డబ్బులను మార్చి 31లోగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారని, ఆ హామీ ఇంకా నెరవేరలేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనూ మార్చి 31 కల్లా రైతులందరికీ రైతు భరోసా అందజేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఏప్రిల్ 1వ తేదీ వచ్చేసినా ఆ నిధుల గురించి ఎలాంటి ప్రకటన రాలేదని ఆయన మండిపడ్డారు. ఉగాది పండుగను పురస్కరించుకుని రైతులు రైతు భరోసా నిధుల కోసం ఎదురుచూశారని, అయితే వారికి ప్రభుత్వం చేదు అనుభవం మిగిల్చిందని హరీష్ రావు విమర్శించారు. దసరాకు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, సంక్రాంతికి అందిస్తామన్నా నిధులు రాలేదని, ఉగాది నాటికి కూడా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడం బాధాకరమన్నారు. కాలండర్లు మారుతున్నా రేవంత్ రెడ్డి మాట మాత్రం మారడం లేదని ఎద్దేవా చేశారు. నాట్ల సీజన్‌లో కేసీఆర్ రైతులకు రైతు బంధు అందించారని, కానీ రేవంత్ రెడ్డి కోతల సమయం వచ్చినా రైతు భరోసా అందించలేకపోయారని హరీష్ రావు ఆరోపించారు. మోసపూరిత పాలననే విధానంగా మార్చుకున్న రేవంత్ రెడ్డి రైతులను అన్ని కోణాల్లో దగా చేస్తున్నారని ఆరోపించారు.

రుణమాఫీ వాగ్దానం ఇంకా నెరవేరలేదు. ఇందిరమ్మ భరోసా పథకం కేవలం మాటలకే పరిమితమైంది. హామీలు నెరవేర్చకుండా మోసం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిపోయింది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగానే, అసెంబ్లీలో ప్రకటించినట్లుగానే రైతు భరోసా నిధులు అందించే వరకు బీఆర్ఎస్ పార్టీ రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తూనే ఉంటు-ంది. ప్రజల్లో మీ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటుందని హరీష్ రావు హెచ్చరించారు.

## 2026 నాటికి నక్సలిజం నిర్మూలనే లక్ష్యం

(మొదటి తరువాయి)

నక్సల్ రహిత భారత్‌ను నిర్మించే దిశగా మనం మరో మైలు రాయిని చేరుకున్నామన్నారు. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో గత కొన్ని రోజులుగా వరుస ఎన్‌కౌంటర్‌లు చోటు- చేసుకుంటున్న విషయం తెలిసిందే. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ కాల్పుల్లో అనేక మంది మావోలు హతమవుతున్నారు. ఈ నేపథ్యంలో మావోయిస్టుల ఏరివేతపై అమిత్ షా తాజాగా స్పందించారు. దేశంలో నక్సలిజాన్ని అంతం చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం కఠినమైన విధానాన్ని అవలంభిస్తున్నట్లు చెప్పారు. దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని మోదీ నిర్ణయించుకున్నారని.. ఇందులో భాగంగా సురక్షిత భారత్‌ను నిర్మించడానికి తాము కృషి చేస్తున్నామని అన్నారు. భారత్‌లో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 నుంచి ఆరుకు తగ్గాయి. తద్వారా కొత్త మైలురాయిని సాధించాం. మోదీ ప్రభుత్వం నక్సలిజం పట్ల కఠినమైన విధానాన్ని అవలంబిస్తోంది. మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని మోదీ నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా సురక్షిత భారత్‌ను నిర్మించడానికి కృషి చేస్తున్నాము. 2026 మార్చినాటికి నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తాం' అని అమిత్ షా వ్యాఖ్యానించారు. హోంమంత్రిత్వ శాఖ రూపొందించిన నివేదికల ప్రకారం.. దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 ఉన్నాయి. అధికారిక రికార్డుల ప్రకారం..2015లో ఇవి 35 ఉండగా..2018 నాటికి 30కి తగ్గాయి. 2021నాటికి 25కు వచ్చాయి. తాజాగా వాటి సంఖ్య 6కు చేరింది. మరోవైపు రాష్ట్రంలో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను సమీక్షించేందుకు అమిత్ షా ఈనెల 4, 5 తేదీల్లో ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించ నున్నారు. ఈ సందర్భంగా ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ కార్యకలాపాలను సమీక్షించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అనంతరం షా ఏప్రిల్ 7, 8 తేదీల్లో జమ్ముకశ్మీర్‌లో కూడా పర్యటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ఢిల్లీ చేరుకున్న చిలీ అధ్యక్షుడు

(మొదటి తరువాయి)

భారత్ పర్యటనలో భాగంగా ఫాంట్ ఢిల్లీలోని మహాత్మాగాంధీ రాజ్‌ఘాట్‌కు చేరుకుని గాంధీజీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'చిలీ మంత్రులు, పార్లమెంటు- సభ్యుల బృందం ఢిల్లీలోని మహాత్మాగాంధీ గౌరవార్థం నిర్మించిన రాజ్‌ఘాట్ వద్ద చేరుకుని ఆయనకు నివాళులర్పించాము. భారతదేశం ఆయన వారసత్వాన్ని గుర్తుచేస్తుంది. ఈ సందర్భంగా మేము ఉమ్మడి ఆసక్తులను పంచుకోవడమే కాదు.. మా ప్రజల భవిష్యత్తు కోసం గొప్ప అవకాశాలనే కాదు.. ప్రాథమిక విలువలను పంచుకున్నాము' అని ఫాంట్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## తెలుగు పంచాంగం 2/4/2025,బుధవారం



సూర్యోదయం & సూర్యాస్తమయం:
సూర్యోదయం: ఉదయం 6:13
సూర్యాస్తమయం: సాయంత్రం 6:25
తిథి:
శుక్ల పక్ష పంచమి: ఏప్రిల్ 2 ఉదయం 2:32 నుండి రాత్రి 11:50 వరకు
శష్ఠి: ఏప్రిల్ 2 రాత్రి 11:50 నుండి ఏప్రిల్ 3 రాత్రి 9:41 వరకు
నక్షత్రం:
కృత్తిక: ఏప్రిల్ 1 ఉదయం 11:06 నుండి ఏప్రిల్ 2 ఉదయం 8:49 వరకు
రోహిణి: ఏప్రిల్ 2 ఉదయం 8:49 నుండి ఏప్రిల్ 3 ఉదయం 7:02 వరకు
అశుభ సమయాలు (దోష కాలాలు):
రాహుకాలం: మధ్యాహ్నం 12:21 నుండి 1:52 వరకు
యమగండం: ఉదయం 8:50 నుండి 10:21 వరకు
దుర్ముహూర్తం: ఉదయం 11:48 నుండి మధ్యాహ్నం 12:38 వరకు, మధ్యాహ్నం 2:46 నుండి 3:36 వరకు
వర్జ్యం: ఉదయం 6:38 నుండి 8:05 వరకు, రాత్రి 4:03 నుండి 5:32 వరకు
శుభ సమయాలు (శుభ ముహూర్తాలు):
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:58 నుండి 12:47 వరకు
అమృతకాలం: ఉదయం 6:38 నుండి 8:05 వరకు, రాత్రి 4:03 నుండి 5:32 వరకు

## ఇందిరమ్మ ఇండ్లలో జర్నలిస్టులకు అవకాశాలు కల్పించాలి

**– రాపోలు లింగస్వామి**



**హైదరాబాద్, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేస్తూ వారధిగా వ్యవహరిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల కోసం, ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రకల్పన అయిన ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో అవకాశాలు కల్పించాలని తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు, RTI కార్యకర్త మరియు జర్నలిస్ట్ రాపోలు లింగస్వామి డిమాండ్ చేశారు.
హైదరాబాద్‌లో మంగళవారం ఆయన మాట్లాడిన సందర్భంలో, జర్నలిస్టుల స్వంత ఇంటి కల ఇంకా సాకారం కాకపోవడం వల్ల వారు అద్దె ఇండ్లలో జీవనాన్ని కొనసాగిస్తూ, అద్దె కట్టలేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో జర్నలిస్టుల పరిస్థితి రోజు రోజుకు ఆందోళనకరంగా మారుతోంది. రెండేళ్లకొసారి ఇవ్వాల్సిన అక్రిడిటేషన్‌లు కూడా సకాలంలో ఇవ్వడం లేదు" అని ఆయన అన్నారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి వారి పరిస్థితిని మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించడం ద్వారా వారి జీవన పరిస్థితుల్లో మార్పు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులు ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం కృషి చేస్తూ, సమాజానికి నిజమైన సేవలందిస్తున్న నేపథ్యంలో, వారిపై ప్రభుత్వం మరింత శ్రద్ధ చూపించాలని ఆయన పేర్కొన్నారు.

# అక్రమ నిర్బంధాలతో ప్రజా పోరాటాలను ఆపలేరు

- గతంలో బీఆర్ఎస్ చేసిన తప్పిదాలే కాంగ్రెస్ చేస్తుంది
- హెచ్.సి.యు భూములు ముమ్మాటికీ యూనివర్సిటీవే
- హెచ్.సి.యు విద్యార్థుల పోరాటానికి బీజేపీ సంపూర్ణ మద్దతు
- బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి



**కొందుర్గు, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని బిజెపి మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. సంపదను సృష్టించడం అంటే ప్రభుత్వ భూములను అమ్మడమేనా అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకీ చెందిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం లాక్కోవడానికి ప్రయత్నం చేయడం హేయమైన చర్య అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తున్న యూనివర్సిటీ భూములను లాక్కొని తమ అనుయాయులకు కట్టబెట్టాలని చూస్తున్న ప్రభుత్వ దుర్మార్గపు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యూనివర్సిటీ భూములను రక్షించేందుకు విద్యార్థులు చేస్తున్న పోరాటాలకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. అక్రమంగా బిజెపి నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో పెట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. అరెస్ట్ అయిన వారిలో బిజెపి మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మయ్య గౌడ్, శివారెడ్డి, బోయ శంకర్, ఈసరి సత్యనారాయణ, కొమరబండ శ్రీశైలం, సున్నాల అంజయ్య, కారుకొండ సుధాకర్, ఈసరి లింగం, బోయ వీరయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# విద్యా వ్యవస్థను కూని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం...

-నియంత పాలన వ్యవహరిస్తే ఖభర్దార్...
-రాష్ట్ర వ్యాప్తంగా అరెస్ట్ చేసిన మా నాయకులను వెంటనే విడుదల చెయ్యాలి
-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి
-హెచ్.సి.యు 400 ఎకరాల భూములను వేలం వేయడాన్ని వ్యతిరేకించిన శ్రీవర్ధన్ రెడ్డి



**షాద్ నగర్, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ హెచ్.సి.యు 400 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేయడాన్ని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో తొమ్మిదవ నిజాం పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. గతంలో అనేక సార్లు ప్రభుత్వం భూ వేలాలను ప్రత్యక్షంగా వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఏ కారణం చేత యూనివర్సిటీ భూములను వేలం వేస్తున్నారని విమర్శించారు. దేవాలయాల లాంటి విద్యా సంస్థలను అభివృద్ధి చేయడం కాకుండా,వేలం వేస్తూ విద్యా వ్యవస్థను కూని చేస్తున్నారని అన్నారు. యూనివర్సిటీ భూములను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న విద్యార్థులపై రేవంత్ రెడ్డి గారు పోలీసులను పెట్టి అరెస్ట్ లు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ సాక్షిగా శ్రీధర్ బాబు గారు యూనివర్సిటీ లో ఒక్క ఇంచ్ కూడా అమ్మమని చెప్పిన వెంటనే రేవంత్ రెడ్డి గారు ఈ నిర్ణయం తీసుకోవడం వెనక సాంకేతమేమిటని ప్రశ్నించారు. వెంటనే యూనివర్సిటీ భూ వేలాన్ని ఆపి వేయాలని లేదంటే బిజెపి నాయకత్వం,ప్రజలను చైతన్యం చేసి యూనివర్సిటీ భూములను కాపాడుకునేందుకు అనేక నిరసన ఉద్యమాలు చేపడుతుందని అన్నారు. అదేవిదంగా రాష్ట్ర వ్యాప్తంగా అరెస్ట్ చేసిన మా నాయకులను వెంటనే విడుదల చేయాలని అన్నారు.

# గ్యాంగ్ రేప్ విచారణ ముమ్మరం



**ఊరుకొండ, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఊరుకొండపేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్న గ్యాంగ్ రేప్ ఘటన తీవ్ర సంచలనంగా మారింది. ఈ దారుణమైన సంఘటనపై పోలీసులు తీవ్రంగా స్పందించి విచారణను ముమ్మరం చేశారు. ఇప్పటికే నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి కీలక సమాచారం సేకరిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు స్వయంగా స్పందించారు. ఐజీ సత్యనారాయణ సంఘటనా స్థలాన్ని సందర్శించి, పరిస్థితిని సమీక్షించారు. ఆయన వెంట ఎస్పీ గై క్యాడ్ వైభవ్ రంగనాథ్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ నాగార్జున తదితర పోలీసులు ఉన్నారు. విచారణలో నిందితులు పూర్తిగా ప్రణాళికాబద్ధంగా ఈ దారుణానికి పాల్పడ్డట్లు స్పష్టమైంది. వివాహిత మహిళపై దాడి చేసి, అనంతరం సాక్షాలను తారుమారు చేసేందుకు పక్కా వ్యూహంతో వ్యవహరించినట్లు పోలీసుల ప్రాథమిక నిర్ధారణ దర్యాప్తులో మరిన్ని షాకింగ్ విషయాలు వెలుగుచూశాయి. నిందితులు గతంలోనూ ఇలాంటి నేరాలకు పాల్పడి, అనుభవాన్ని సంపాదించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటన ఆలయ ప్రాంతంలో చోటుచేసుకోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఊరుకొండపేట ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చే మైనర్లను బెదిరించి, డబ్బు తీసుకుని వదిలిపెట్టేలా కొన్ని వ్యక్తులు వ్యవహరించినట్లు సమాచారం. ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశాన్ని నిందితులు సద్వినియోగం చేసుకుని, పక్కా సమాచారంతో దాడులకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు ఈ దారుణ ఘటనపై ఐజీ సత్యనారాయణ తీవ్రంగా స్పందిస్తూ, నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని, కఠినంగా శిక్షిస్తామని, బాధితురాలికి న్యాయం చేయడమే తమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఈ ఘటన తర్వాత ఆలయ పరిసర భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని, భక్తులకు పూర్తి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు గ్రామస్తులు, భక్తులు ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, నేరస్తుల కదలికలను గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. విచారణ మరింత వేగవంతం చేసి, బాధితురాలికి న్యాయం చేసేందుకు పోలీసు యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తోంది.

## మృతురాలి కుటుంబానికి రూ. 5, వేల ఆర్థిక సాయం అందజేత



**కడ్తాల్, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కడ్తాల పట్టణానికి చెందిన ముత్యాల పోచమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా 3 వేల రూపాయలు గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా 2 వేల రూపాయలు కలిపి మొత్తం 5 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతురాలి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు కోఆర్డినేటర్ మంగళపల్లి నరసింహ, బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి మూడ రవికుమార్, నాయకులు సిద్ధిగారి దాసు, సురేష్, తుప్పరి శ్రీశైలం, సోను, సిద్ధిగారి మణికంఠ, కరుణాకర్, రాఘవ, శంకర్, విష్ణు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కేశంపేట్ మండల కేంద్రంలో సన్న బియ్యం పంపిన చేసిన ఎమ్మెల్యే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**కేశంపేట్, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా కేశంపేట్ మండలం కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణి కేశంపేట్ మండలం కేంద్రం లో కార్యక్రమాన్ని ప్రారంభించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రూప్ 1 ఫలితాల్లో సత్తా చాటిన మల్లేష్ యాదవ్



**ఆమనగల్లు, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగా రెడ్డి జిల్లా ఆమన గల్లు పట్టణంలోని గుర్రంగుట్ట కాలనీకి చెందిన కావటి యాదయ్య , పార్వతమ్మ కుమారుడు కావటి మల్లేశ్ యాదవ్ ఇప్పటికే మూడు ప్రభుత్వ ఉద్యో గాలకు ఎంపికై తన ప్రతిభను చాటుకున్నాడు. నేడు వెలువడిన గ్రూప్ 1 మెరిట్ లిస్టులో రాష్ట్ర స్థాయిలో 187వ ర్యాంకు, మల్టీజోన్ 2 విభాగంలో 92 వ ర్యాంకు సాధించాడు. అంతకుముందు జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా, గురుకులంలో టీజీటీగా, గురుకులంలో పీజీటీగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ప్రస్తుతం గురు కుల కళాశాలలో జూనియర్ లెక్చలర్గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉన్నత ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో గ్రూప్ 1లో కష్టపడి ఉత్తమ ర్యాంకు సాధించిన సందర్భంగా మంగళవారం అమనగల్ వారి నివాసంలో ఆకుతోటపల్లి మార్నింగ్ వాక్ మిత్రులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. తహసీల్దార్ రామచంద్రయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పుట్టి ఉన్నత చదువులకు పేదరికం అడ్డు రాదని నిరూపించిన మల్లేష్ యాదవ్ ను నేటి యువత ఆదర్శంగా తీసుకుని మంచి ఉన్నత స్థాయిలో ఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆకుతోటపల్లి మార్నింగ్ వాక్ సభ్యులు కృష్ణయ్య, శ్రీను, మల్లేష్, ప్రసాద్, తిరుపతి గౌడ్ రాకేష్, నవీన్, షకీల్ ,సాయి, తదితరులు పాల్గొన్నారు

## యూజీడీ పనులను శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

**ఎల్బీనగర్ ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్.సీ.ఐ.కాలనీ ఫేస్.2 నందు నూతనంగా నిర్మించే యూ.జీ.డీ.పనులకు శంకుస్థాపన చేసిన ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి .ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు 450 ఏం.ఏం.డయా పైప్ లైన్ వేయడం జరుగుతుంది అని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ గౌడ్,మధుగౌడ్,జైపాల్ రెడ్డి,నవీద్,ముకుంద్ రాజ్,నర్సింహారావు,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కావటి మల్లేష్ యాదవ్ కి అభినందనల వెల్లువ



**ఆమనగల్, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని గుర్రం గుట్ట కాలనీకి చెందిన కావటి మల్లేష్ యాదవ్ తన అంకితభావంతో, పట్టుదలతో తన ప్రతిభను ప్రదర్శించి సామాజిక గౌరవాన్ని అందుకున్నారు. వ్యవసాయదంపతులు కావటి యాదయ్య, పార్వతమ్మల కుమారుడైన మల్లేష్, ఇప్పటికే మూడు ప్రభుత్వ ఉద్యోగాల్లో తన సమర్థతను నిరూపించారు. తాజాగా గ్రూప్ 1 మెరిట్ లిస్టులో రాష్ట్రస్థాయిలో 187వ ర్యాంకు, మల్టీజోన్ 2 విభాగంలో 92వ ర్యాంకు సాధించడం ద్వారా అతను ఉన్నత శిఖరాలను అధిరోహించాడు. మల్లేష్ విజయాన్ని పురస్కరించుకుని ఆమనగల్ పట్టణంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు, ఆమనగల్ మాజీ జడ్పీటిసి కండె హరిప్రసాద్ మల్లేష్ ప్రతిభ, పట్టుదల, సంకల్పం గురించి ప్రశంసించారు. సముదాయానికి మల్లేష్ విజయాలు స్ఫూర్తిదాయకమని హరిప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మాజీ ఎంపీపీ లలిత, వెంకటయ్య, మాజీ కౌన్సిలర్లు శ్రీశైలం, విజయకృష్ణ, నరసింహ, మాజీ సర్పంచ్ బక్కి కుమార్, జనిగల గిరి, వరికుప్పల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు మల్లేష్ విజయాన్ని గర్వంగా భావిస్తూ ఉత్సాహభరితంగా ఈ వేడుకను జరిపారు.

## పేదలకు సన్న బియ్యం పంపిణీ ని ప్రారంభించనున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి,ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్ ప్రెస్**
ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నేడు నియోజకవర్గంలోని మండలాలలో లాంచనంగా ప్రారంభించనున్నారు. ఉదయం 10:30 గంటలకు ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలోని 3వ నెంబర్ రేషన్ షాప్ లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అనంతరం,ఉదయం 11:30 గంటలకు పెద్దమందడి మండల కేంద్రంలోని 1వ రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మధ్యాహ్నం 12:30 గంటలకు వనపర్తి పట్టణంలోని 1వ నెంబర్, 9వ నెంబర్, 20వ రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.మధ్యాహ్నం 3 గంటలకు గోపాల్పేట మండల కేంద్రం సాకల్ పల్లి రోడ్డులో గల 22వ రేషన్ షాపులో సన్న బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 4 గంటలకు పెబ్బేరు మండల కేంద్రంలోని రెండవ నెంబర్ రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారు. కార్యక్రమాలకు ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, పెద్దలు, తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయవలసిందిగా మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కార్యక్రమాల వివరాల ను విడుదల చేసింది.

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం





**లోయపల్లి, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భారత రత్న, స్వర్గీయ శ్రీ అటల్ బిహారీ వాజ్‌పాయ్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని, భారతీయ జనతా పార్టీ, లోయపల్లి శాఖ ఆధ్వర్యంలో, జెడ్పీహెచ్ఎస్ హై స్కూల్‌లో లైన్స్ క్లబ్ సహకారంతో ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమం ఆరోగ్యంపై అవగాహన పెంచడంలో మరియు వైద్య సేవలను అందించడంలో మైలురాయిగా నిలిచింది. గ్రామస్థుల అనుకూలతతో 90 మందికి పైగా కంటి చూపు పరీక్షలు నిర్వహించగా, కంటి ఆపరేషన్ కోసం 15 మందిని గుర్తించారు. ఈ విశేషం ద్వారా గ్రామ ప్రజలు తమ ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెట్టే అవకాశం పొందారు. ఈ కార్యక్రమంలో భారత రత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ ను స్మరించుకుంటూ, మాజీ వార్డు సభ్యులు కావలి వెంకటేష్, కార్యకర్తలు కారింగ్ కిరణ్, ఉయ్యాల భాను, నారి విక్రమ్, చెరుకు జగదీష్ తదితరులు పాల్గొన్నారు. వారి సత్ప్రయత్నాలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశాయి.

## షార్ట్ సర్క్యూట్ తో ప్రమాదం జరిగిన బాధితులకు ఆర్థిక సహాయం అందజేసిన ఉప్పల వెంకటేష్



**కల్వకుర్తి, ఏప్రిల్1(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి పట్టణంలో సుభాష్ నగర్ కాలనీలో ఉన్న అప్నా బజార్,ఎంఎస్ సొల్యూషన్ సోమవారం రోజు అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిన విషయాన్ని పట్టణ ఆర్య వైశ్య సంఘం నాయకులు ఉప్పల వెంకటేష్ కు చెప్పడంతో, వెంటనే ఆర్య వైశ్య సంఘం సభ్యులు తో కలిసి మంగళవారం సాయంత్రం ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు.పూర్తిగా కాలిపోయిన కంప్యూటర్ లను, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరిశీలించారు. అనంతరం బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.వారికి మనోధైర్యం కల్పించి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒక లక్ష పదహారు వేల రూపాయల చెక్కును అందించారు..జిల్లా,రాష్ట్ర నాయకులు,కుల సంఘాలు స్పందించి బాధితులను ఆదుకోవాలి అని కోరారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు కిరణ్ ప్రసాద్,రవి,ముత్యాలు, వాస శేఖర్,మనోహర్,లింగం,కృష్ణయ్య,శ్రీధర్,శ్రీను మాజీ కౌన్సిలర్ సూర్య ప్రకాష్,మధు,మాజీ సర్పంచ్ జంగయ్య,మాజీ వైస్ ఎంపీపీ అరుణ్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ వెంకటయ్య,వాహీద్,దారమోని గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

మమ్మల్ని సంప్రదించడానికి:
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**

# నేటి నుండి తెల్ల రేషన్ కార్డు ఉన్న వారందరికీ ఉచిత సన్న బియ్యం పంపిణీ

**-వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వెంకటేశ్వర్లు**



**వనపర్తి,ఏప్రిల్ 1( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
ఏప్రిల్ 2 నుండి వనపర్తి జిల్లాలో తెల్ల రేషన్ కార్డుల వారికి చౌక ధర దుకాణాల నుండి ఉచితంగా సన్న రకం బియ్యం సరఫరా చేయనున్నట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జిల్లాలోని ఆయా నియోజకర్గాల్లో స్థానిక శాసన సభ్యులు చౌక ధర దుకాణాల్లో సన్న రకం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 1,59,353 తెల్ల రేషన్ కార్డులు ఉండగా 5,22,367 మంది కుటుంబ సభ్యులు ఉన్నట్లు గణాంకాలు వెల్లడించారు. రేషన్ కార్డులోని ఒక్కో కుటుంబ సభ్యునికి నెలకు 6 కిలోల చొప్పున సన్న రకం బియ్యం ఉచితంగా ఇవ్వనున్నారు. దీనికోసం జిల్లాలో 3309 మెట్రిక్ టన్నుల సన్న రకం బియ్యం అవసరం ఉంటుంది. బుధవారం నుండి జిల్లాలోని మొత్తం 324 చౌక ధర దుకాణాల్లో సన్న బియ్యం ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లాలో సన్న రకం బియ్యం పంపిణీ చేయుటకు అవసరమైన ధాన్యం నిల్వలు ఉన్నట్లు అదనపు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని తెల్ల రేషన్ కార్డు కుటుంబాలు ప్రభుత్వం ద్వారా ఇస్తున్న ఉచిత సన్న రకం బియ్యాన్ని తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# రేవంత్ రెడ్డి సర్కార్ పై రైతుల తిరుగుబాటు తప్పదు

**-కాంగ్రెస్ వింత పాలనలో కొంతైనా మెరుగు జరుగుతుందని కేసీఆర్ భావిస్తున్నాడు**
**-గంగవరం రామకృష్ణారెడ్డి**



**వనపర్తి,ఏప్రిల్ 1 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రేవంత్ రెడ్డి సర్కార్ పై రైతులు త్వరలోనే తిరుగుబాటు చేస్తారని, కాంగ్రెస్ వింత పాలనలో కొంతైనా మేలు జరుగుతుందని కేసీఆర్ భావిస్తున్నారు అని మంగళవారం నీలగిరి ఎక్స్ ప్రెస్ న్యూస్ తో వనపర్తి కాంటెస్ట్ ఎమ్మెల్యే గంగవరం రామకృష్ణారెడ్డి అన్నారు. తెలంగాణలో అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమన్వయం లేకపోవడం వలన రేవంత్ రెడ్డి, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను,నెరవేర్చలేక పోతున్నారని,పాడిందే పాట పాసుపండ్ల దాసరి గత ప్రభుత్వం పై కేసీఆర్ పై విమర్శలు చేయడానికి తప్ప ఒక్క హామీని కూడా సరైన రీతిలో అమలు చేయలేక పోతున్నారని, ముఖ్యంగా రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక పోవడం వలన త్వరలోనే రైతులు రోడ్డెక్కనున్నారని, ఒక్కొక్క మంత్రి ఒక్కొక్క తీరుగా మాట్లాడడం సొంత పార్టీ నేతలకే అయోమయ పరిస్థితి ఏర్పడుతుందని, ముఖ్యంగా రెండు లక్షల రుణమాఫీ విషయంలో రైతులు ఆగ్రహం గా ఉన్నారని ఇచ్చిన హామీలు నెరవేర్చలేక కొత్త కొత్త హామీలకు పూనుకుంటున్నారని అసలు తన పార్టీలో మంత్రివర్గ విస్తరణ చేయకుండా విద్యా వ్యవస్థను పోలీసు వ్యవస్థను గాలికి వదిలేసి కేవలం తమ తమ కుర్చీలను కాపాడుకోవడానికి మాత్రమే ప్రయత్నం చేస్తున్నారు తప్ప మరొకటి లేదని చెప్పవచ్చు ఇవన్నీ గమనించిన కేసీఆర్ కాంగ్రెస్ వింత పాలనకు కొంతైనా తమకు మేలు జరుగుతుందని తాను కోరుకుంటున్నట్లు, ఇది అదునుగా తీసుకొని ప్రజలకు ధైర్యాన్నిస్తూ ముందుకు వెళ్లాలని తమ సన్నిహిత వర్గాలకు దిశా నిర్దేశం ఇస్తూ బహిరంగ సభలు ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థలో కాంగ్రెస్ ను చిత్తుచిత్తుగా ఓడించాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆయన అన్నారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి

**- బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ అధ్యక్షులు మేకల రాజేందర్**



**కల్వకుర్తి, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఊరుకొండ పేట శ్రీ అభయాంజనేయ స్వామి వారి గుడి పరిసర ప్రాంతంలో రెండు రోజుల కింద జరిగిన అమానవీయమైన సంఘటన మహిళపై అత్యాచారం జరిగిన సందర్భంలో ఈరోజు బీసీ సబ్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఘటనా స్థలాన్ని పరిశీలించి నిజ నిర్ధారణ చేసి ఆలయ ఈవో మరియు పోలీసులతో మాట్లాడడం జరిగింది...ఈ సందర్భంగా బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ నాయకులు మాట్లాడుతూ నిందితులు ఎవరైనా కఠినంగా శిక్షించాలని ఈ చర్యలకు మూలాలు కనుక్కొని అక్కడ చికిత్స చేయాల్సిన అవసరం ఉందని పాలక మండలి నిర్లక్ష్య వైఖరి వీడి భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి ప్రయత్నం చేయాలని ఆలయ పరిసర ప్రాంతాలలో వీధిలైట్లు సీసీ కెమెరాలు మరియు కాంపౌండ్ వాళ్ళు నిర్మించి భక్తుల ప్రాణాన్ని మానాన్ని కాపాడాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం పైన ఉందని డిమాండ్ చేయడం చేశారు ఇలాంటి సంఘటనలు ఈ సమాజంలో అశాంతిని మేలుకొలుపుతాయని అభద్రత భావాన్ని పెంపొందిస్తాయని ఆందోళన చెందుతూ పోలీసు వారు ఆలయ అధికారులు పాలకమండలి సంపూర్ణంగా కలిసి పనిచేయాలని ఇకముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా భక్తులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు ఇంతకుముందు కూడా గుట్ట పరిసర ప్రాంతాలలో ఎవరైతే ఒంటరి మహిళలు విద్యార్థులు ఇస్తారో వారిని బెదిరించే పనులు జరుగుతున్నట్టు మా దృష్టికి రావడం జరిగింది ఇక నుంచి పోలీసు వారు భద్రత అంశంలో మధ్య పడకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని బాధ్యత మహిళలకు న్యాయం చేయాలని నిందితులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్ చేయడం చేశారు ఈ కార్యక్రమంలో బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ తాలూకా ప్రధాన కార్యదర్శి మరియు ఆలయ మాజీ సభ్యులు గోపాల్ , ముఖ్య సలహాదారు సదానందం గౌడ్ కార్మికుల జంగయ్య ఉపాధ్యక్షులు రమేష్ చారి , దివాకర్ గౌడ్ మరియు వీరస్వామి మాదిగ , మల్లేష్ లు పాల్గొనడం జరిగింది.

# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**

-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.

-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.

-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**

-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.

-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.

చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"

మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# ఊరుకొండ పేట ఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలి

- దేవాలయ పాలకమండలి రద్దు చేయాలి
- హిందూ దేవాలయాలలో నిఘా వ్యవస్థను పటిష్ఠ పరచాలి
- విశ్వహిందూ పరిషత్,హిందూ సంఘాలు డిమాండ్.



**కల్వకుర్తి, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):** పవిత్రమైన పుణ్య క్షేత్రాలలో మహిళలకు భద్రత లేకుండా పోవడాన్ని విశ్వహిందూ పరిషత్,హిందూ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని విశ్వహిందూ పరిషత్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు శివయ్య గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఊరుకొండ పేట ఆంజనేయస్వామి దేవాలయనికి విశ్వహిందూ పరిషత్ హిందూ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామిని దర్శించుకొవడం జరిగింది. ఈ సందర్భంగా శివయ్య గౌడ్ మాట్లాడుతూ హిందూ దేవాలయాల వద్ద ఇలాంటి సంఘటనలు చాలా బాధాకరమని ప్రజలు, భక్తులు తీవ్ర ఆవేదన ఆందోళన చెందుతున్నారని భక్తులు వారి యొక్క కష్టాలు తొలగాలని, వారి జీవితంలో ఆనందం ఉండాలని దేవుని గుడికి వెళ్లి పూజలు చేస్తారు.కానీ దేవుని దేవాలయ ప్రాంగణంలో మహిళలకు రక్షణ లేకుండా పోతే,బయటికి రావాలన్న భయభ్రాంతులకు గురి అవుతున్నారు అని అన్నారు ఆంజనేయ స్వామి దేవాలయానికి రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు వారి కోరికలను తీర్చుకోవడానికి స్వామి వారిని దర్శించుకుంటారని,ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఆలయం లో ఇలాంటి సంఘటనలు ఈ ప్రాంతం లో చోటు చేసుకోవడం పై ప్రజలు భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. దేవాలయలలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా,ఆలయంలో నిత్యం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని,గుడి ప్రాంగణం అంత సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని,ఆలయం వద్ద సరైన వసతులు కల్పించాలని, దేవాలయ పాలకమండలిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు గిరిధర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, మొగిలి దుర్గాప్రసాద్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి దన్నోజు నరేష్ చారి, హిందూ సంఘాల ప్రతినిధులు ఆంజనేయులు, రాము, వివేకానంద, బొట్టు రాజు, ఉరుకొండ మండల బిజెపి అధ్యక్షులు రాజేందర్, బీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు నిరంజన్ గౌడ్,జిల్లా కౌన్సిల్ సభ్యులు లక్ష్మారెడ్డి, నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యవసాయ మహోత్సవం -2025

- రైతాంగ భవిష్యత్తుకు నూతన దిశా నిర్దేశం






**హైదరాబాద్,ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)** :తెలంగాణ వ్యవసాయ రంగాన్ని ఆధునికతకు చేరువ చేస్తూ, రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఓ కొత్త అధ్యాయం మొదలుపెట్టింది. అగ్రి హార్టికల్చర్ ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 11 నుండి 14 వరకు 'తెలంగాణ వ్యవసాయ మహోత్సవం -2025' పేరుతో అత్యంత ప్రతిష్టాత్మకంగా వ్యవసాయ ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ మహోత్సవం వ్యవసాయ రంగంలో సాంకేతికతను వినియోగించే పద్ధతులపై దృష్టి సారించనుంది. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, ప్రకృతి సిద్ధ వ్యవసాయ విధానాలు, సేంద్రియ ఎరువుల ప్రభావం, భూసార పరిరక్షణ, వాణిజ్య పంటలపై తాజా పరిశోధనలు వంటి విస్తృత అంశాలను రైతులకు పరిచయం చేస్తూ, వ్యవసాయ రంగానికి కొత్త ఊపునిచ్చే ప్రయత్నం చేయనుంది. బీఆర్కె భవన్ లో వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఈ మహోత్సవ బ్రోచర్ విడుదల చేస్తూ, రైతుల పెరుగుతున్న పెట్టుబడులు, లాభసాటి ధరలలోపంతో కలుగుతున్న సమస్యలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. రాష్ట్ర రైతాంగం తగిన పరిష్కారాలను పొందేందుకు మరియు వ్యవసాయానికి కొత్త దిశా నిర్దేశం చేయడంలో తెలంగాణ వ్యవసాయ కమిషన్ కీలక పాత్ర పోషిస్తుందనని ఆయన అభివర్ణించారు కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి భూసారం తగ్గుదల కారణంగా పంట దిగుబడిపై పడుతున్న ప్రభావాన్ని ప్రస్తావించారు. అధిక రసాయన వినియోగం భూమి నిస్సారంగా మారడాన్ని మరింత తీవ్రతరం చేస్తోందని పేర్కొంటూ, సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా భూమి జీవసత్వం పునరుద్ధరించవచ్చని తెలిపారు. స్వయంగా తన పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అమలు చేసి విజయవంతమైన ఫలితాలు పొందిన విషయాన్ని ఆయన షేర్ చేశారు. తెలంగాణ అగ్రి హార్టికల్చర్ ఎగ్జిబిషన్ సొసైటీ వ్యవసాయ రంగానికి అవసరమైన పరిష్కారాలు మరియు సాంకేతికతను అందించడంలో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. ఈ మహోత్సవం రైతులు తమ వ్యవసాయ విధానాలను మెరుగుపరుచుకోవడానికి, వినూత్న మార్గాలను అన్వేషించడానికి ఆదర్శ వేదికగా నిలుస్తుంది. వ్యవసాయ భూముల భూసారాన్ని రక్షిస్తూ, భవిష్యత్తు పంటల దిగుబడిని పెంచేందుకు నూతన ఆవిష్కరణలను అలవరచుకోవడం సమిష్టి బాధ్యతగా నిపుణులు అభిప్రాయపడ్డారు. మహోత్సవం సమాజంలోని రైతాంగానికి కొత్త దిశను చూపించడంలో, వ్యవసాయ రంగానికి ప్రగతిని తెస్తూ ప్రజల ఆశావహాలను నింపడంలో కీలకంగా ఉండనుంది. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి భవాని రెడ్డి వ్యవసాయ అధికారి హరి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శతాబ్ద టౌన్షిప్ ఎండీ కాసు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు



**తలకొండపల్లి, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):** శతాబ్ద టౌన్షిప్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నేత కాసు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో అట్టహాసంగా నిర్వహించబడ్డాయి. కాంగ్రెస్ నాయకులు మోహన్ రెడ్డి, సురేష్, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు శుభాకాంక్షలు అందించారు.

ఈ సందర్భంగా, పుష్పగుచ్ఛాలు అందించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, శ్రీనివాస్ రెడ్డి ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాజకీయం, అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన చేసిన కృషిని కొనియాడుతూ, ఆయన నాయకత్వంలో మండలానికి కొత్త మజిలీలు తీసుకురాగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కాసు శ్రీనివాస్ రెడ్డి ప్రజాసమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తున్నారనీ, తన సేవల ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడుతున్నారనీ కార్యకర్తలు పేర్కొన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.

# పేకాట ఆడుతూ దొరికిన పేకాట రాయుళ్లు



**కల్వకుర్తి, ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని నాగర్ కర్నూల్ రోడ్డులో అఖిల్ అనే వ్యక్తి ఇంట్లో క్రాంతి నేతృత్వంలో పేకాట ఆడుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు కల్వకుర్తి ఎస్సై మాధవ రెడ్డి,సిబ్బంది తో తనిఖీ చేయగా ఏడుగురు వ్యక్తులు మూడు (ముక్కలాట) పేకాట ఆడుతూ కనిపించారు వారిని వెంటనే అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించి,విచారించగా వారి వద్ద నుండి 66,700 నగదు, పేక ముక్కలను సీజ్ చేసినట్లు తెలిపారు.అరెస్ట్ చేసిన వారిలో అఖిల్,క్రాంతి,సత్యం యాదవ్,సంతు యాదవ్,వంశీకృష్ణ,బురాన్,ప్రశాంత్ల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఆటో బోల్తా పలువురికి గాయాలు



**వెల్దండ,ఏప్రిల్ 1( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** :వెల్దండ పట్టణ సమీపంలో సాయంత్రము 5 గంటల సమయంలో హైదరాబాద్ నుండి కల్వకుర్తి వెళ్తున్న ఆటో అదుపుతప్పి కింద పడిపోవడంతొ పలువురికి గాయాలు కావడం జరిగింది. వెల్దండ వైపు వస్తున్న నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్యాడ్ వైభవ్ రంగనాథ్ సంఘటన స్థలంలో ఆగి స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించి క్షతగాత్రులను అంబులెన్స్ రావడం ఆలస్యం అవుతుండడంతో పోలీసు వాహనంలో కల్వకుర్తి గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు.

# దోషులను కఠినంగా శిక్షించాలి


## మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ఊరుకొండ,ఏప్రిల్ 1( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** ఊరుకొండ పేట లో మహిళపై గ్యాంగ్ రేప్ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాను అని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వివరించారు . నేర స్థలంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి కేసు ను. పక్కదారి పట్టకుండా నిందితులు ఎంతటి వారైనా ఏ పార్టీకి చెందిన వారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. పక్కాగా దర్యాప్తు చేయాలని పోలీసులను కోరుతున్నాను అని బాధితురాలని ప్రభుత్వం ఆదుకోవాలి నిందితులను కఠినంగా శిక్షించాలనిజడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కోరారు . ఆలయ పరిసర ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెట్టాలి అని అన్నారు. అత్యాచార ఘటన అత్యంత దురదృష్టకరమని ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు మహిళల భద్రత అంశము ఆందోళన కలిగిస్తుంది ఊరుకొండ పేట ఆలయం దగ్గర ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం సిగ్గుచేటు అని అన్నారు.

# బిజినెస్

## అమెరికా టారిఫ్‌ల భయం.. భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు




**న్యూఢిల్లీ ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఇవాళ భారీ నష్టాలతో ముగిశాయి. అమెరికా టారిఫ్‌లు భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు భారీగా నష్టపోయాయి. ఇంట్రాడేలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 1400 పాయింట్లకు పైగా క్షీణించగా.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 23,200 మార్క్ దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3.5 లక్షల కోట్లు క్షీణించి రూ.409 లక్షల కోట్లకు పడిపోయింది. సెన్సెక్స్ ఉదయం 76,882.58 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,414.92) నష్టాలతో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,912.18 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1390.41 పాయింట్ల నష్టంతో 76,024.51 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 353.65 పాయింట్ల నష్టంతో 23,165 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.

**పతనానికి కారణాలు..**

ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయం ప్రకటించనున్న నేపథ్యంలో సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దేశీయ ఐటీ కంపెనీలకు అమెరికా నుంచే ప్రధానంగా ఆదాయం వస్తుంది. అలాంటిది అమెరికాలో ఐటీకి ఆశించిన మేర డిమాండ్ ఉండకపోవచ్చునే అంచనాలతో ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టీ, హెచ్‌సీఎల్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

అంతర్జాతీయ మార్కెట్‌లో ఇటీవల 70 డాలర్ల వద్ద ట్రేడయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర మళ్లీ 75 డాలర్ల స్థాయికి చేరింది. భారత్ చమురును ప్రధానంగా దిగుమతి చేసుకునే దేశం కావడంతో మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇటీవల దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా 8 సెషన్లలో దాదాపు 5 శాతానికి పైగా పెరిగాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం కూడా మరో కారణమని విశ్లేషకులు చెబుతున్నారు.

# బంగారం @ 94,150



**న్యూఢిల్లీ ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):** బంగారం ధర భగ్గుమంటోంది. మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై ఏకంగా రూ.2,000 ఎగిసి రూ.94,150కి చేరినట్లు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. దీంతో తొలిసారి రూ.94వేల మార్క్‌ను దాటినట్లయ్యింది. అమెరికా వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో బంగారంపై పెట్టుబడులను సురక్షితంగా భావిస్తోన్న నేపథ్యంలో ఆ లోహం ధరలు అమాంతం పెరుగుతున్నాయి. 2025లో ఇప్పటి వరకు బంగారం ధర దాదాపు 18 శాతం పెరిగింది. జనవరి 1న రూ.79,390గా నమోదయ్యింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.15,000 ఎగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సు 3,149 డాలర్లకు చేరడంతో దేశీయంగా అదే స్థాయిలో పెరుగుతోంది. మరోవైపు కిలో వెండిపై రూ.500 తగ్గి రూ.1,02,500గా పలికింది.

## మార్చిలో భారీగా పెరిగిన జీఎస్టీ వసూళ్లు..

### -గత ఏడాది మార్చితో పోల్చితే 9.9 శాతం వృద్ధి




**న్యూఢిల్లీ ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వస్తు, సేవల పన్ను వసూళ్లలో మరోసారి భారీ వృద్ధి నమోదైంది. గత ఏడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది మార్చిలో జీఎస్టీ వసూళ్లు 9.9 శాతం పెరిగి రూ.1.96 లక్షల కోట్లకు చేరాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో సీజీఎస్టీ వసూళ్లు రూ.38,100 కోట్లు కాగా.. ఎస్‌జీఎస్టీ వసూళ్లు రూ.49,900 కోట్లుగా ఉన్నాయి.అదేవిధంగా ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ రూపంలో రూ.95,900 కోట్లు, సెస్సుల రూపంలో రూ.12,300 కోట్లు వసూలైనట్లు కేంద్రం తెలిపింది. దేశీయ లావాదేవీలు 8.8 శాతం పెరిగి మొత్తం రూ.1.490 లక్షల కోట్లు ఆదాయం వచ్చింది. దిగుమతి చేసిన వస్తువులపై వచ్చే ఆదాయంలో 13.56 వృద్ధితో రూ.46,919 కోట్లు సమకూరినట్లు కేంద్రం వెల్లడించింది. రిఫండ్స్ రూపంలో రూ.19,615 కోట్లు చెల్లించగా.. నికరంగా రూ.1.76 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు నమోదైనట్లు కేంద్రం పేర్కొంది.

# స్పోర్ట్స్

## వచ్చే వన్డే వరల్డ్ కప్ ఆడుతా'.. వీడ్కోలు వార్తలకు చెక్ పెట్టిన కోహ్లీ



**న్యూఢిల్లీ ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)** భారత జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ అభిమానులకు తీపి కబురు చెప్పాడు. తన వీడ్కోలు గురించి ప్రచారమవుతున్న వదంతులను తోసిపుచ్చాడు. టీ20లకు రిటైర్మెంట్ పలికిన తాను వన్డేలకు అందుబాటులో ఉంటానని, వచ్చే వన్డే వరల్డ్ కప్‌లోనూ ఆడతానని చెప్పాడు విరాట్. ఐపీఎల్ 18వ సీజన్‌లో చెలరేగి ఆడుతున్న కోహ్లీ తాజాగా ఒక ఈవెంట్‌కు హాజరయ్యాడు. అక్కడ నిర్వాహకులు, అభిమానులు అతడిని 'మీ సుదీర్ఘ కెరియర్‌లో తర్వాతి పెద్ద అడుగు ఏంటీ?' అని అడిగారు.అందుకు.. తర్వాతి బిగ్ స్టెప్ అంటే.. ప్రస్తుతానికి కచ్చితంగా ఫలానా అని చెప్పలేను. కానీ, వచ్చే వరల్డ్ కప్ గెలవాలని ఉంది. అదే బహుశా నా కెరియర్‌లో మరో పెద్ద అడుగు అని బదులిచ్చాడు కోహ్లీ. అతడి సమాధానం విన్న అక్కడివారంతా చప్పట్లు కొడుతూ భారత స్టార్ ప్లేయర్‌కు మద్దతు తెలిపారు.వెస్టిండీస్ గడ్డపై నిరుడు టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన విరాట్.. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. సఫారీలను ఓడించి ట్రోఫీ గెలుపొందిన తర్వాత భావోద్వేగానికి గురైన అతడు.. పొట్టి ఫార్మాట్ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించాడు. అతడిని అనుసరిస్తూ కెప్టెన్ రోహిత్ శర్మ, రవీంద్ర జడేజాలు టీ20లకు వీడ్కోలు పలికారు. అప్పటి నుంచి వన్డేలు, టెస్టులకు మాత్రమే అందుబాటులో ఉంటున్నారీ సీనియర్ త్రయం. అయితే.. ఈ మధ్యే ఈ ముగ్గురి సెంట్రల్ కాంట్రాక్ట్‌లో మార్పులు తథ్యమనే వార్తలు వినిపించాయి. ప్రస్తుతం ఏ ప్లస్ విభాగంలో ఉన్న విరాట్, రోహిత్, జడ్డూలను ఏ కేటగిరీ ఆటగాళ్లుగా పరిగణించాలని బీసీసీఐ భావిస్తుందనే కథనాలు ప్రసారమయ్యాయి. ఈ నేపథ్యంలో తాను దక్షిణాఫ్రికా, జింబాబ్వే సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న 2027 వన్డే వరల్డ్ కప్‌లో ఆడాలని భావిస్తున్నట్టు విరాట్ చెప్పడంతో రిటైర్మెంట్ ఇప్పట్లో లేనట్టే అని అభిమానులు మురిసిపోతున్నారు. ప్రస్తుతం 36 ఏళ్లున్న కోహ్లీ.. ఫిట్‌నెస్ రీత్యా, ఫామ్ రీత్యా.. వరల్డ్ కప్ టోర్నీలో ఆడేందుకు అన్ని విధాలా అర్హుడే. ఇప్పటికే 2011 వన్డే వరల్డ్ కప్, 2013 ఛాంపియన్స్ ట్రోఫీ, ఈమధ్యే ఛాంపియన్స్ ట్రోఫీ గెలుపొందిన జట్టులో సభ్యుడైన విరాట్ మరొక వరల్డ్ కప్ ఆడి.. ట్రోఫీని ముద్దాడితే చూసి తరించాలని ప్రతి ఒక్కరి కోరిక.

## దీపక్ చాహర్‌పై సీఎస్కే ఫ్యాన్స్ ఫైర్!




**ముంబై ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఐపీఎల్ 2025 టోర్నమెంట్ కోసం ముంబై ఇండియన్స్ జట్టులో భాగమైన చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ఆటగాడు దీపక్ చాహర్ సోమవారం కీలక వ్యాఖ్యలు చేశాడు. కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్ ముగింపులో దీపక్ చాహర్ బ్రాడ్‌కాస్టర్‌కు దీపక్ చాహర్ ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఈ ఇంటర్వ్యూలో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య తేడా చెప్పమని అడిగారు. ఆ సమయంలో ఆయన చెప్పిన ఒక విషయం వివాదానికి దారి తీసింది. "చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో ఒకే ఒక్క కెప్టెన్ ఉన్నాడు. కానీ ముంబై ఇండియన్స్ జట్టులో చాలా మంది కెప్టెన్లు ఉన్నారు." అని దీపక్ చాహర్ బదులిచ్చాడు. దీని అర్థం ఏమిటంటే.. సీఎస్కే జట్టులోని ప్రతిదాన్నీ నియంత్రిస్తాడని.. కానీ ముంబై ఇండియన్స్‌కు కెప్టెన్ హార్దిక్ పాండ్యా, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, అనుభవజ్ఞులు సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా నాయకత్వం వహిస్తున్నారని దీపక్ చాహర్ చెప్పినట్లుగా అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో దీపక్ చాహర్ ప్రకటన సరైనదేనా అంటూ సీఎస్కే ఫ్యాన్స్ విమర్శిస్తున్నారు. రుతురాజ్ గైక్వాడ్ ప్రస్తుతం సీఎస్కే జట్టు కెప్టెన్ గా ఉన్నాడు. ధోని అతనికి సహాయం చేసినప్పటికీ రుతురాజ్ గైక్వాడ్ చాలా నిర్ణయాలు తీసుకుంటాడు. కాబట్టి దీపక్ చాహర్ చెప్పిన దాని ప్రకారం.. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీని నిర్వహించడం లేదని అర్థమవుతోంది. ఈ క్రమంలో అభిమానులు దానిని ఎత్తిచూపుతూ దీపక్ చాహర్ ను విమర్శిస్తున్నారు. ఇది మాత్రమే కాకుండా ఐపీఎల్ సిరీస్‌కు సీఎస్కే జట్టు ఎలా సిద్ధమవుతుందనే రహస్యాన్ని కూడా వెల్లడించాడు. దీపక్ చాహర్ మాట్లాడుతూ.. "రెండు జట్లు ఎల్లప్పుడూ ఐపీఎల్ ట్రోఫీ గెలవడం గురించి ఆలోచిస్తూ ఉంటాయి. మొదటి రోజు నుంచే ఐపీఎల్ ట్రోఫీని గెలవాలని అంటూ ఉంటారు. సీఎస్కేతో ఉన్నప్పుడు కోచింగ్ సిబ్బంది ఐపీఎల్ ఫైనల్ లో చివరి ఓవర్ వేస్తున్నట్లుగా ప్రాక్టీస్ చేయమని నాకు చెప్పేవారు. అదే విధంగా బ్యాటర్లకు ఫైనల్ చివరి ఓవర్లో బ్యాటింగ్ చేస్తున్నట్లుగా ప్రాక్టీస్ చేయమని చెబుతారు. ట్రోఫీని గెలవడమే మా లక్ష్యం" అని దీపక్ చాహర్ అన్నారు.

## శ్రేయాస్, నేహాల్ వధేరా విధ్వంసక ఇన్నింగ్స్.. చిత్తుగా ఓడిన లక్నో



**న్యూఢిల్లీ ఏప్రిల్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఐపీఎల్ 18వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ రెండో విజయం సాధించింది. తొలిపోరులో గుజరాత్ టైటన్స్‌కు షాకిచ్చిన పంజాబ్.. లక్నో వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్(69), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(52 నాటౌట్ : 34 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లు), ఇంప్యాక్ట్ ప్లేయర్ నేహాల్ వధేరా(43 నాటౌట్ : 25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లు) ధనాధన్ ఆడారు. వీరిద్దరి మెరుపులతో లక్నోపై 8 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది పంజాబ్. 16.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఏకపక్ష పోరులో లక్నోపై 8 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసి నాలుగు పాయింట్లు ఖాతాలో వేసుకుంది పంజాబ్.ఐపీఎల్ టైటిల్ వేటలో ఉన్న పంజాబ్ కింగ్స్ అదరగొడుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్ సేన ఘన విజయం సొంతం చేసుకుంది. ఆల్‌రౌండ్ షోతో లక్నో సూపర్ జెయింట్స్‌ను 8 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. 172 పరుగుల ఛేదనలో ఓపెనర్ ప్రియన్ష్ ఆర్య(8) త్వరగానే వెనుదిరిగినా.. ప్రభ్‌సిమ్రాన్ సింగ్(69) మరింత ధాటిగా ఆడాడు. పవర్ ప్లేలో 62-1తో పటిష్ట స్థితిలో నిలిచిన పంజాబ్ ఇన్నింగ్స్ మరింత వేగంగా సాగింది. అర్ధ శతకం తర్వాత ప్రభ్‌సిమ్రాన్ మరింత ధాటిగా ఆడాడు.ప్రభ్‌సిమ్రన్ 110 వద్ద ఔటయ్యాక కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు జత కలిసిన ఇంప్యాక్ట్ ప్లేయర్ నేహాల్ వధేరా ఆకాశమే హద్దుగా చెలరేగాడు. దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీకి పంపి లక్ష్యాన్ని మంచుముక్కలా కరిగించాడు. బిష్ణోయ్ వేసిన 14వ ఓవర్లో ఇంప్యాక్ట్ ప్లేయర్ నేహాల్ వధేరా 6,4, 6 తో 16 రన్స్ పిండుకున్నాడు. అవేశ్ ఖాన్ వేసిన తర్వాతి ఓవర్లో గేర్ మార్చిన శ్రేయాస్ 4, 6 బాదాడు. శార్దూల్ ఠాకూర్‌కు చుక్కలు చూపిస్తూ నేహాల్ వరుసగా రెండుసార్లు బంతిని స్టాండ్స్‌లోకి పంపి జట్టు స్కోర్ 160 దాటించాడు. ఐదో బంతిని బౌండరీకి పంపగా స్కోర్ సమం అయింది. మరుసటి ఓవర్లో అయ్యర్ సిక్సర్‌తో అర్ధ శతకం సాధించి.. జట్టుకు 8 వికెట్ల విజయాన్ని అందించాడు.